# రత్నాలదీవి

వి. నాగేశ్వరరావు

ఉదయం ఆరు గంటలయింది.

బొంబాయి రేవు నుంచి షిప్ బయలుదేరింది. ఫస్ట్ క్లాస్‌లో నలుగురు మాత్రమే వున్నాము. నేను, సాయి, ప్రసాద్, విలియం.

మేము నలుగురము ఆస్ట్రేలియా ప్రయాణమై వెళ్ళు తున్నాం. ఆస్ట్రేలియాలో మంచి వింత అయిన జంతువులు వుంటాయని, ఫోటోలు మున్నగునవి సంపాదించడానికి బయలుదేరామని అందరికి చెప్పాం.

కాని, అది అసలయిన కారణం కాదు.

నాకు పురాతన వస్తువులు సేకరించడం అంటే మహా ఇష్టం. నేను ఒకసారి ఒక స్మగ్లర్ దగ్గర పూర్వకాలపు

నాటి కత్తి ఒకటి కొన్నాను. దాని పిడి బంగారంతో చేసి మిగిలిన భాగం అంతా వేరొక లోహంతో చేయబడి చాలా చిత్రంగా వుంది.

దానిని నేను జాగ్రత్తగా పరిశీలిస్తుండగా ఆ కత్తి పిడి కొంచెం కదిలినట్లు అనిపించింది. దానిని బలంగా త్రిప్పితే ఆ కత్తి పిడి చేతిలోకి వూడి వచ్చింది.

ఆ కత్తిపిడిలోపల కొంచెం డొల్లగా వుంది. దానిలో ఒక నిధి తాలూకు రహస్యం, దాని మేప్ కనిపించాయి. ఆ నిధి ఎంత వుంటుందో తెలియదు.

ఆ మేప్ ప్రకారం వెడితే నిధి చాలా సులభంగా దొరుకుతుంది. ఆ నిధి ఆస్ట్రేలియాలోనున్న రత్నాల దీవిలో వుంది. ఆ దీవికి ఆ పేరెలా వచ్చిందో కాని చాలా భయంకరమయిందట. అందుకే నాకు తోడుగా నా ప్రాణమిత్రులైన సాయి, ప్రసాద్, విలియంలను కూడా తీసుకెళుతున్నాను. నిధి దొరికితే నలుగురం సమంగా పంచుకోవటానికి అంగీకరించాను.

ముందుగా ఆస్ట్రేలియాకు షిప్ మీద బయలుదేరాం. షిప్ చైనామీదుగా పసిఫిక్ సముద్రము మీదుగా ఆస్ట్రేలియాకు బయలుదేరింది.

షిప్ నెమ్మదిగా నడుస్తోంది.

సముద్రం అంతా ప్రశాంతంగా వుంది. మేము వేసిన పదార్థాలను తినడానికి దూకుతున్న చేపలను చూస్తుంటే మాకు చూడ ముచ్చటగా వుంది.

సాయంత్రపు నీరెండ అందంగా డెక్ మీదపడుతోంది. సిగరెట్ కాలుస్తూ సాయి డెక్ మీదకు వచ్చి మా ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాడు.

"మనం బయలుదేరి చాలా రోజులయింది. ఇంకా ఎన్నాళ్ళలో మనం ఆస్ట్రేలియా చేరుకుంటాం?" అన్నాడు సాయి.

"రెండు రోజులలో చేరుకోవచ్చు వాతావరణం ప్రశాంతంగా వుంటే" చెప్పాను నేను.

"మనం ఆస్ట్రేలియా చేరిన వెంటనే చిన్న మోటారు బోటును కొని, దానిలో మనకు కావలసిన సామాను వేసుకొని రత్నాలదీవికి బయలుదేరుదాం. దారిలో ఎక్కడ ఆలస్యం చేయవద్దు" అన్నాడు విలియం. అతనికి ఆత్రుత ఎక్కువగా వుంది.

షిప్ మూడవ రోజున అనుకున్నట్లుగానే హార్బరును చేరుకుంది.

## 2

మేము మోటారుబోటును ఒకదాన్ని కొని, దానిలో అవసరమయిన సామానులు వేసుకొని రత్నాలదీవికి బయలు దేరాం.

ఆస్ట్రేలియానుంచి ఆ దీవి అరవై మైళ్ళ దూరంలో వుంది.

పదహారు గంటల ప్రయాణం తర్వాత మా బోటు ఆ దీవిని చేరుకున్నది.

మా బోట్‌ను సముద్రపు ఒడ్డున వున్న ఇసుకలోనికి లాగి, దానిని ఒక కొబ్బరిచెట్టుకు కట్టి, దీవిలోకి ప్రవేశించాం, లగేజ్ బాగ్‌లతో. మా అందరి భుజాలకు మెషిన్‌గన్స్ వ్రేలాడుతున్నాయి.

"మనం నిధిని స్వాధీనం చేసుకున్నప్పుడు అక్కడ ఏమైనా జంతువులు ఉంటే నిధికి బలి ఇద్దాం," అన్నాడు ప్రసాద్.

ప్రసాద్ మూఢనమ్మకానికి నవ్వుకున్నాను.

"మనం ఎన్ని మైళ్ళు వెళ్ళాలి?" అన్నాడు విలియం.

"సుమారు నలభై మైళ్ళు అయినా వెళ్ళాలి" అన్నాడు సాయి మ్యాపు వైపు చూస్తూ.

నలుగురం కబుర్లు చెప్పుకొంటూ నడుస్తున్నాం.

ఎండ నడినెత్తిమీదకు వచ్చింది.

ఆ దీవినిండా రకరకములయిన చెట్లు, పెద్ద పెద్ద కొండలు ఉన్నాయి.

సాయి, విలియం ఏవో కబుర్లు చెప్పుకుంటూ ముందు నడుస్తుండగా వెనుక ప్రసాద్, నేను నడుస్తున్నాం.

"అదిగో మన మొదటి గుర్తు" అంటూ సాయి మాకు ఒక కొండను చూపించాడు.

మేము మ్యాప్‌ను చూచి 'ఔనని' అంగీకరించాం. ఆ కొండ చాలా దూరంలో వుంది.

దానిని చేరుకొనేటప్పటికి చుట్టూ చీకట్లు క్రమ్ముకొన్నాయి. తూర్పునుంచి చంద్రుడు తొంగిచూస్తున్నాడు.

"మనం ఈ రాత్రికి ఇక్కడే వుండిపోయి రేపు ఉదయమే బయలుదేరి వెళ్ళిపోవచ్చు. రాత్రి ప్రాంతంలో ఇక్కడ అడుగు ముందుకు వేయలేం" అన్నాడు విలియం.

"అవును నీవు చెప్పింది నిజమే" అన్నాడు ప్రసాద్.

మేము ఆ రాత్రికి అక్కడే వుండిపోవడానికి నిశ్చయించుకొని మంచి ప్రదేశం కోసం వెదుకుచుండగా కొండకు కొంచెం పైన చిన్న గుహలాంటిది కనిపించింది. ఆ రాత్రికి దానిలో వుండాలని నిశ్చయించుకున్నాం.

మేము ఆ గుహను చేరుకొని ఆ రాతిమీద నే మా

హోల్డాల్లు పరుచుకొని కబుర్లు చెప్పుకొంటూ బ్రెడ్ పాకెట్స్ విప్పాం. ఉదయం నుంచి ఆకలితో వుండటం వలన వాటిని చూడగానే మాకు విపరీతమయిన ఆకలి వేయసాగింది.

ఆ రాత్రికి వంతులవారీగా అందరము కాపలా కాయాలనుకున్నాం.

ముందుగా విలియం కాపలా కాయాలి.

విలియం మిషన్ గన్ దగ్గర పెట్టుకొని కూర్చున్నాడు. మిగిలిన వాళ్ళం నిద్రలోకి జారుకున్నాం.

బాగా అలసిపోయి వుండటంవలన మత్తుగా నిద్ర పోతున్నాం.

ఉన్నట్టుండి ఎక్కడనుంచో భయంకరమైన కేక వినిపించింది.

విలియం వులిక్కి పడి కూర్చున్నాడు.

మేము కూడా లేచి కూర్చున్నాం.

మరొకసారి భయంకరంగా ఆ కేక వినిపించింది.

మాకు ఆ కేక వింటూంటే గుండెలు అదురుతున్నాయి. జేబులోనుంచి అగ్గిపెట్టెతీసి వెలిగిస్తూ క్రిందకు చూచాను. క్రింద ఏమీ కనిపించటం లేదు.

బైనాక్యులర్ తీసాను.

"ఏమిటి గిరి అది?" అన్నాడు ప్రసాద్ నేను బైనాక్యులర్ తో క్రిందకు చూస్తుంటేను.

"చీకటివలన ఏమీ కనిపించటం లే"దన్నాను.

మేము నలుగురము మెషిన్ గన్స్ రెడీగా పట్టుకూర్చున్నాం. ఆ కేక వింటే మాకు భయమేస్తోంది.

మరల ఆ కేక మాకు వినిపించలేదు. అయినా తెల్ల

వాళ్లు అలాగే కూర్చున్నాం జాగరణ చేస్తూ.

తెల్లవారిన తరువాత మేము రాత్రి కేక వినిపించిన వైపుకు వెళ్ళాం. మాకు అక్కడ ఏమీ కనిపించలేదుగాని అక్కడ వున్న ఇసుక మీద కొన్ని కాలి ముద్రలు కనిపించాయి.

ఒక్కొక్క ముద్ర ఒక్కొక్క అడుగు పొడవు వుంటుంది. ఎందుకో వాటిని చూడగానే మాకు భయం వేసింది.

దేవుని మీద భారం వేసి ముందుకు కదిలాం.

"ఓ మైగాడ్! అటు చూడండి" అంటూ ముందుకు చూపించాడు విలియం.

అందరము ముందుకు చూచి అదిరిపడ్డాం.

మాకు ఎవరికి నోటమ్మట మాట రాలేదు.

ఎదురుగా ఫర్లాంగు దూరంలో...

ఒక భయంకరమయిన జంతువు నిలబడి వుంది. శరీరం బల్లి ఆకృతిలో వుంది. దాని నోటిలో కత్తులవంటి కోరలున్నాయి. దాని తోక దాని ఆకారానికి తగినట్లుగానే వుంది.

అది మమ్ములను చూడగానే భయంకరంగా అరిచింది.

అప్పుడు మేము గుర్తుపట్టాం. మాకు రాత్రి వినిపించిన అరుపు దానిదే.

అది మా అందరిని చూడగానే మా వైపు భయంకరంగా అడుగులు వేస్తూ రాసాగింది. అది అంత పెద్ద జంతువు అయినా చాలా వేగంగా నడచి వస్తోంది.

మేము నలుగురము ఒకేసారి మిషన్ గన్స్ దానివైపు గురిచూచి ట్రిగ్గర్స్ నొక్కాం.

బులెట్స్ సరాసరి వెళ్ళి ఆ జంతువు శరీరంలోకి దిగ బడ్డాయి. అయినా అది కోపంతో ముందుకు వస్తోంది. దాని నోటిలో నుంచి మంటలు, సెగలు వస్తున్నాయి.

మేము వెనక్కి తిరిగి పరుగుపెట్ట సాగాం. అది మమ్మ లను విడిచిపెట్టక మమ్ములను తరుముకు వస్తోంది. మేము మా ఇష్టం వచ్చినట్లు పరుగు పెడుతున్నాం.

అది మా సమీపానికివచ్చి దాని తోకను ఒక్కసారిగా గాలిలోకి ఆడించింది!

దాని తోక ఊపడంతో, దాని సమీపాన వున్న నాకు తగిలి నేను బంతిలా దూరంగా ఎగిరిపడ్డాను. నా శరీరంలో వెయ్యి కిలోవాట్ల విద్యుత్ ప్రవహించినట్లయింది.

అది నన్ను వదలిపెట్టి మా వాళ్ళవైపు పరుగుపెట్టింది' నాతోబాటు నా బాగ్, నా గన్ కూడ నా ప్రక్కనే పడ్డాయి.

దాని శరీరం నుంచి రక్తం వరదగా కారుతోంది. చేతి లోకి మిషన్‌గన్ తీసుకొని దాని కళ్ళలోకి గురిచూచి కాల్చాను.

బులెట్స్ వెళ్ళి ఆ జంతువు కళ్ళను నాశనంచేసి పారే సాయి. అతి భయంకరంగా అరుస్తూ పరుగెట్టుకొంటూ పారిపోయింది. అది ఇంకొంచెం సేపటిలో చచ్చిపోతుంది.

నేను పైకి లేవలేకపోయాను. మావాళ్లు వచ్చి నన్ను లేవదీశారు. నా శరీరమంతా నొప్పిగా వుంది.

కొంచెం బ్రాందీని గొంతుకలో వేసుకొని ముందుకు బయలుదేరాం,అటువంటి జంతువులు మళ్ళీ ఎక్కడ తారస పడతాయో నని భయపడుతూ.

# 3

ఆ జంతువు తరమడంతో మేము పూర్తిగా దారితప్పి పోయాం. మేము ఎటు ప్రయాణం చేస్తున్నామో మాకు తెలియడంలేదు. మా దగ్గర వున్న కంపాస్ ఎక్కడో జారిపోయింది.

మా దగ్గర వున్న నీరుకూడ అయిపోయింది. ఆ దీవిలో ఎక్కడ నీరుకూడ కనిపించడంలేదు.

"మనం దారితప్పిపోయాం. మనం ఇక ఆ నిధిని చేరుకుంటామో, లేదో" అన్నాడు ప్రసాద్, అటువంటి పరిస్థితులలో కూడ.

అప్పటికే మేము పూర్తిగా అలిసిపోయి వున్నాం. మాకు నీటి సమస్య పట్టుకుంది.

బాగ్‌లోనుంచి బైనాక్యులర్ తీసి చుట్టూ పరీక్షగా చూస్తున్నాను, ఎక్కడయినా నీరు కనిపిస్తుందాని. అప్పటికే నాలుకలు పిడచకట్టుకుపోతున్నాయి.

దూరంగా మాకు ఏదో చిన్న చెరువు బైనాక్యులర్‌లో కనిపించింది. ఆ విషయం తక్కినవాళ్ళకు చెప్పి అటువైపు పరుగుపెట్టాను. నా వెనుక మా వాళ్ళు బయలుదేరారు.

మేము చెరువు దగ్గరకు చేరుకొని కావలసినంత నీరు తృప్తిగా త్రాగాం.

"మనం స్నానంచేసి రెండురోజు లయింది. ఈ చెరువులో స్నానం చేద్దాం," అన్నాడు సాయి.

"మొసళ్ళువంటివి ఏమైనా వుంటాయి. వద్దు" అన్నాడు విలియం, అంత స్వచ్ఛమయిన నీటిని అనుమానంగా చూస్తూ.

“ఫరవాలేదు! అవి వున్న సూచనలు కనిపించడం లేదు” అంటూ ప్రసాద్ నీటిలోకి దిగాడు.

అప్పటికే బట్టలు తీసి ఒడ్డున పెట్టాడు.

ప్రసాద్ వెనుక మేమూ నీటిలోకి దిగాం.

ముందుజాగ్రత్తకోసం నేను మొలలో చాకు పెట్టుకున్నాను.

నీటిలో సరదాగా స్నానం చేస్తున్నాం.

“అమ్మో! మొసలి కాళ్ళు పట్టుకొని లాగేస్తుంది రక్షించండి” అంటూ విలియం కేకలు పెట్టసాగాడు.

ప్రసాద్ రివాల్వర్ తీసుకురావడానికి గట్టుమీదకు వెళ్ళాడు. మాకు నీళ్ళలో ఏమీ కనిపించడంలేదు గాని విలియం క్షణక్షణానికి కొద్దికొద్దిగా మునిగిపోతున్నాడు.

సాయి నా మొలలో వున్న చాకు తీసుకొని నీటిలోకి మునిగి కొంచెం సేపటికి పైకివచ్చాడు. విలియంకూడ ఒడ్డుకు చేరుకున్నాడు వాలిపోయిన ముఖంతో.

విలియం తన కాళ్ళను చూచుకొంటూ “ఆశ్చర్యంగా ఉందే. మొసలి నన్ను పట్టుకున్నా, నాకాళ్ళదగ్గర రక్తం రావడంలేదు” అన్నాడు.

మొసలిని చంపితే నీటిమీదకు రక్తం రావాలి. అదీ రాలేదు.

సాయి కత్తిని నాకిచ్చేసాడు.

“ఇంతకు విలియంను పట్టుకున్నదేమిటి?” అన్నాను కుతూహలంగా.

“ఆ నీటిలో బ్లేడర్‌వర్ట్ అనే మొక్క వుంది. ఆ మొక్కలు నీటి అడుగున పెరుగుతాయి. వాటికి రబ్బరులా సాగే గుణం వుంటుంది. నీటిలో దిగినవారిని అది లోపలకు

లాగుకొని అరగిస్తుంది'' అన్నాడు సాయి.

''అయితే అది భయంకరమయిన మొక్క అన్నమాట. నిజంగా మొసలి అనుకొని ఫిస్టల్ కోసం పైకి వచ్చాను'' అన్నాడు ప్రసాద్.

''నీవు దానిని కోసి వేసావా?'' అన్నాను సాయిని.

''లేదు! అది అంత సులభంగా తెగదు. దాని రబ్బరు తిత్తులలో కత్తితో పొడిచేటప్పటికి అది విలియంను కొంచెం వదలిపెట్టింది. వెంటనే విలియంను పైకి తీసుకు వచ్చేసాను,'' అన్నాడు.

మాకు చాలా భయం వేసింది.

ఇక ఆ దీవిలో ఉండగా నీటిలోకి దిగకూడదను కున్నాం. ముందుముందు ఏమవుతుందో తెలియకుండా ఉంది.

మేము అలా నడుస్తూ సాయంత్రానికి ఒక లోయను చేరుకున్నాం.

ఆ లోయ చాల భయంకరంగా కనిపిస్తుంది. ఆ లోయ క్రింది భాగమంతా చెట్లతో నిండివుంది.

ఆ లోయ ప్రక్కనే మాకు కొన్ని వేరుశనగల్లాంటి మొక్కలు కనిపించాయి.

అప్పటికే చీకటి క్రమ్ముకొంటోంది.

మా జేబులలోను, బాగ్ లలోను వాటి కాయలు కొన్ని వేసుకున్నాం.

అవి తప్ప తినడానికి మాకు ఏమీ కనిపించడంలేదు అక్కడ.

మా దగ్గర ఆహార నిల్వకూడ ఎంతోలేదు.

మేము ఆరాత్రికి అక్కడే విశ్రాంతి తీసుకోవాలని అను

కున్నాం. ఆ లోయ సమీపాన వున్న కొండను అతికష్టం మీద ఎక్కి ఓ పెద్ద బండరాతిమీద కూర్చున్నాము.

"మనం ఇన్ని పాట్లు పడవలసి వస్తుందనుకోలేదు" అన్నాడు విలియం.

"మనం నిధికోసం బయలుదేరాం. కష్టాలు పడకుండా సంపాదించలేం ధనాన్ని" అన్నాడు సాయి నవ్వుతూ.

నలుగురము వేరుశెనగకాయలు తింటూ కబుర్లు చెప్పుకోసాగాం.

మా దృష్టి వేరుశెనగ పైరుమీద పడింది.

మా ఆశ్చర్యానికి అంతులేదు.

అక్కడ......

ఒక చిన్న జంతువు వేరుశెనగకాయలను ఒలుచుకు తింటోంది ఒక చేతితో. ఇంకొక చేతితో పెద్ద పొడవైన త్రాచును పట్టుకొని దానితోక దగ్గరనుంచి వేరుశెనగ కాయలతోబాటు కొరుక్కు తింటూంది.

ఆ త్రాచుపాము గిలగిలలాడుతూ తప్పించుకోవడానికి చూస్తూంది.

ఆ దృశ్యం చూస్తూంటే నాకు ఒళ్లు గగుర్పొడిచింది.

త్రాచుపాముకు జంతువులు జడుస్తాయి. అటువంటిది ఈ జంతువు పాము బ్రతికి ఉండగానే వేరుశెనగ కాయలతోబాటు ఎంతో సంతోషంగా, విందుభోజనం తిన్నట్లుగా తింటూంది.

ఇంతకు ఆ జంతువు పేరు పెక్కారి. అది వేరుశెనగ పైరు దగ్గర ఉన్న పాములను పట్టుకొని వేరుశెనగకాయలతోబాటు ఎంతో ప్రీతిగా తింటుంది.

"మనం నిధికోసం వచ్చి ఇక్కడ చిక్కుపడిపోయాం.

నిధితో క్షేమంగా ఇంటికి చేరితే, నేను తిరుపతి వెళ్ళి గుండుగీయించుకుంటాను'' అన్నాడు విలియం నవ్వుతూ.

మేము ఆ రాత్రికి అక్కడే వుండిపోయాం.

## 4

తెల్లవారింది. తిరిగి బయలుదేరాము, నిధి వేటకు.

మేము కొండ దిగుతుండగా ఏమి జరిగిందోకాని హఠాత్తుగా తూలిదొర్లుకుంటూ పోయాం. అలా దొర్లుకొంటూ ఆ లోయ చివరిభాగానికి చేరుకున్నాం.

ఆగడానికి ఎక్కడ పట్టుదొరకటం లేదు. అలా దొర్లుకొంటూపోయి ఆ లోయలో పడ్డాం.

మాకు భయంతో స్పృహతప్పింది.

మాకు స్పృహ వచ్చేటప్పటికి మేము నలుగురము ఒక పెద్ద చెట్టుమీద పడివున్నాం. ఆ చెట్టు గుబురుగా మంచి వైశాల్యం కలిగివుంది.

మాకు అంతగా దెబ్బలు తగలలేదు. అక్కడక్కడ కొట్టుకుపోయింది.

మేము క్రిందకు దిగి చుట్టూ చూసేటప్పటికి మాకు కొంచెం దూరంలో చిన్న గుడి కనిపించింది.

ముందుగా దానిని ప్రసాద్ చూచి ఆనందంతో కేకలు వేసాడు. అది నిధి తాలూకు రెండవగుర్తు.

మేము దారితప్పిపోయినా సరిఅయిన దారిలో పడినందుకు దేవునికి కృతజ్ఞతలు చెప్పుకున్నాం మనస్సులో.

మేము ఉత్సాహంగా ముందుకు కదిలాం. దారిలో కావలసినన్ని పళ్ళు చెట్లకు వున్నాయి. నీటికికూడ కొదవ లేదు. అడుగడుక్కి చెరువులు, కాలువలు వున్నాయి. ఉత్సాహంగా నడవసాగాము. అప్పటివరకు మాకు

ఎలాంటి ప్రమాదాలు వాటిల్లనందుకు భగవంతుడికి ధన్యవాదా లర్పించుకున్నాము.

అంతలో, మా ప్రక్కన టపటపమని శబ్దం వినిపించడంతో ప్రక్కకు చూచి అదిరిపడ్డాం.

మా వైపు కొన్ని రెక్కల పాములు ఎగురుకొంటూ వస్తున్నాయి. వాటిని చూస్తునే కొయ్యబారిపోయాం.

అవి బాగా దగ్గరకు వచ్చేటప్పటికి తేరుకొని, మిషన్ గన్స్‌తో టపటపమని కాల్చసాగాము. వాటిని కాల్చే కొలది విపరీతంగా వచ్చిపడుతున్నాయి.

అరగంట శ్రమపడి అన్ని పాములను కాల్చిపారేసాం. ఇక అక్కడ వుండకూడదని వడివడిగా బయలుదేరాం.

కొద్దిదూరం నడిచి ఎందుకో టక్కున ఆగిపోయాము. మాలో సాయి కనుపించలేదు. గుండె ఆగినంత పనైంది. చుట్టూ కలియజూశాము.

ఒకచోట సాయి క్రిందపడి నురుగులు కక్కుతూ, గిల గిల కొట్టుకొంటున్నాడు. మేము అటువేపు పరుగెత్తాము. ఒక రెక్కలపాము సాయిని వదిలి మా వైపు రాసాగింది. కోపంగా గన్ తీసికొని దానిని కాల్చిచంపాను.

అప్పటికే సాయిలో చలనం ఆగిపోయింది. మా దుఃఖానికి అంతులేదు. కర్తవ్యం స్ఫురించగా సాయి శవాన్ని బాధతో సెలయేటిలోకి నెట్టి భారంగా ముందుకు కదిలాము.

## 5

మేము ముగ్గురము కొండలు, మిట్టలు దాటుతున్నాం. మా దగ్గర వున్న మేప్ ప్రకారం నిధి ఇంకా ఎంతోదూరం లేదు.

మా కాళ్లు లాగేస్తున్నా, మేము ఉత్సాహంగా నడుస్తున్నాం.

"నీవు నిధితో ఏమి చేస్తావ్?" అన్నాను విలియంని.

"నీవు ఏం చేస్తావ్?" అని తిరిగి నన్ను ప్రశ్నించాడు.

"ముందు నీవు చెప్పు" అన్నాను నవ్వుతూ.

"నేను ఫ్యాక్టరీలు, భవనాలు, భూములు కొంటాను" అన్నాడు విలియం చిరునవ్వు నవ్వుతూ.

"డబ్బు వస్తే అందరూ చేసేపని అదే" అన్నాను.

విలియం నవ్వి ఊరుకున్నాడు.

ప్రసాద్ మా ఇద్దరి మాటలు విని నవ్వుకున్నాడు.

మేము రెండు ఫర్లాంగుల దూరం నడువగానే, కొంచెం దూరం నుంచి భయంకరమయిన అరుపులు వినిపించాయి.

చెట్లు విరిగిన చప్పుడు, జంతువుల అరుపులతో ఆ ప్రదేశం మారుమ్రోగిపోతోంది.

రెండు జంతువులు ఫర్లాంగు దూరంలో భీభత్సంగా పోరాడుతున్నాయి.

వాటిని చూచి మేము ఆశ్చర్యపోయాం.

అవి ఒక్కొక్క జంతువు నాలుగు ఏనుగులు కలిపినంతగా వున్నాయి. వాటి మెడలు పొడవుగా త్రాటివలె వున్నాయి. ఆ మెడలతో ఒకదాని నొకటి చుట్టుకొంటూ అవి పోట్లాడుకొంటున్నాయి.

అవి ఒకదాని మెడను ఒకటి చుట్టుకోవడంతో వాటి మెడలు రెండు ముడిపడిపోయాయి.

ఒక దాని మెడ ఒకటి లాగుకొనడంలో వాటి రెండు మెడలు గట్టిగా బిగుసుకుపోయి ఊపిరి ఆడక, మెడ ఎముక విరిగి నేలకూలాయి రెండు జంతువులు.

వాటిని తప్పించుకొని ముందుకు సాగాము.

# 6

"అదిగో...నిధి" అన్నాడు ప్రసాద్ ఒకవైపు వ్రేలితో చూపిస్తూ.

అక్కడ ఒక డేగ ఎగురుచున్నట్లుగా వుంది. అదే నిధికి వెళ్ళవలసిన దారి.

మేము ఉత్సాహంగా దానిని సమీపించాం.

దానిచుట్టూ రకరకాల మొక్కలు పెరిగిపోయి వున్నాయి.

వాటిని తప్పించుకొని ఆ విగ్రహం దగ్గరకు వెళ్ళడానికి దారిలేదు. మా దగ్గర వున్న చాకుతో వాటిని నరుక్కుంటూ ఆ విగ్రహం దగ్గరకు సమీపించాం.

అది ఏనాడో చెక్కిన పురాతన విగ్రహం.

ప్రసాద్ ఆ డేగ తలనుపట్టుకొని విచిత్రంగా తిప్పాడు. వెంటనే ఆ డేగ ఎడమవైపుకు వున్న రాయి నిశ్శబ్దంగా తప్పుకుంది.

ఆ దారివైపు చూస్తేతప్ప అది తెరచుకున్నట్లు మనకు తెలియదు.

దానిలోపల ఒక విశాలమయిన గది వుంది. ఆ గదికి మధ్యగా రత్నాలు, మాణిక్యాలు, కెంపులు గదిలో ధాన్యపు రాశిలా వున్నాయి.

ఆ నిధి దగ్గరకు పోయి గెంతులు వేసాం మా ఇష్టం వచ్చినంత సేపు.

కొంత సేపు ఆ రత్నాలమీద కూర్చొని విశ్రాంతి తీసుకున్నాం.

ఆ నిధి నంతటిని తీసుకువెళ్ళాలంటే ఒక లారీ సరిపోదు.

అంత నిధిని అక్కడ ఎవరు దాచారో తెలియదు.

"మనం దీనిని ఎలా తీసుకువెళదాం" అన్నాను.

"మన బాగ్‌లలో వేసుకువెడదాం. వాటిని ఖాళీ చేయండి" అని చెప్పి తన బాగ్‌లో వున్న వస్తువులను తీసివేసాడు విలియం.

మేము బాగ్‌ల నిండా రత్నాలతో నింపాం. ఒక్కొక్కటి చాలా ఖరీదు చేస్తుంది. మూడు బాగ్‌లు రత్నాలతో నిండిపోయాయి.

"వాటర్ బాగ్‌లలో కూడ వేయండి, ఆ నీటిని పారబోసి" అన్నాడు ప్రసాద్.

"మనకు నీరు ఎలా?"

"దారిపొడవునా కాలువలు, చెరువులు వున్నాయి. మనకు కావలసినంత నీరు. ముందు మనం దారతప్పడం వలన అన్ని కష్టాలు పడ్డాం."

వాటర్ బాగ్‌లలో నీటిని పారబోసి, వాటిని కెంపులతో నింపాం.

బాగ్‌లు, వాటర్ బాగ్‌లు కలిపి చాలా బరువున్నాయి. ప్రసాద్ జేబులలో కూడా రత్నాలు వేసుకున్నాడు.

"ఇక చాలు! మనం నడువలేం" అన్నాడు విలియం.

"వీటిని వదలి నాకు రావడానికి మనస్సు ఒప్పుకోవడం లేదు" అన్నాను.

"మనకు ఇవే ఎక్కువ. మనకు ఇంకా కావాలంటే తరువాత మళ్ళీ వద్దాం," అన్నాడు విలియం విసుగ్గా.

మేము ఆ గదిని వదలి బయటకు రాగానే ఆ రాతి తలుపు విచిత్రంగా మూసుకుపోయింది.

కాని అప్పుడే జరుగరాని ఘోరం జరిగిపోయింది. ఆ సంచుల బరువు మోయలేక మోయలేక మోస్తూ నెమ్మదిగా

వస్తున్న ప్రసాద్ సరిగ్గా, రాతి తలుపుమధ్యలో ఇరుక్కు పోయి చావుకేక పెట్టాడు. అతని శరీరం నిలువునా రెండు ముక్కలుగా చీలిపోయి ఒక భాగం ఇవతలగా, రెండవభాగం గుహలోపల పడిపోయాయి.

ఊహించని ఆ సంఘటనకు దిగ్భ్రమతో ఐదునిమిషాలు నోట మాటలేక కొయ్యబొమ్మల్లా నిల్చుండి పోయాము నేను, విలియం. ప్రసాద్ రక్తంతో తడిసిన ఆ రాతి తలుపు ఎర్రగా మెరుస్తూంది.

నాకు దుఃఖం ముంచుకొచ్చింది. ఇద్దరి మిత్రుల చావుకు కారణమైన ఆ నిధిపైన, నాపైన నాకే అసహ్యం వేసింది. నేను తీసుకురాకపోతే వారికి యీ దుర్గతి పట్టేదికాదు. దుఃఖంతో అక్కడే చతికిలబడిపోయాను.

## 7

ప్రసాద్ శవాన్ని ఒక గోతి తీసి పూడ్చిపెట్టి, నేను విలియం తిరుగుముఖం పట్టాము.

మా దగ్గర వున్న బాగ్‌లు చాలా బరువున్నాయి. వాటిని మోయలేక మోస్తున్నాం.

మా దగ్గర వున్న వాటర్ బాగ్‌లు పారవేసినా కొంత బరువు తగ్గుతుంది. వాటిని వదలివేయడానికి మాకుమనస్సు రావడం లేదు.

అప్పటికే మా దగ్గర వున్న రెండు మిషన్ గన్స్‌లో ఒకటి వదలివేసాం.

అప్పటికి నేను, విలియం సగందూరం వచ్చాం.

విలియం ఆకస్మాత్తుగా నన్ను ఆపి —

"అటు చూడు" అన్నాడు.

నా దృష్టి అటువైపు త్రిప్పి ఆశ్చర్యపోయాను.

అక్కడ ఒక కోయ పడుచు నగ్నంగా కాలువలో

స్నానం చేస్తూంది.

మాకు ఇంతవరకు ఎక్కడా నరసంచారం అన్నది ఆ దీవిలో కనిపించలేదు. అసలు ఈ దీవిమీద మనుష్యులుంటారనుకోలేదు.

విలియం చిన్నగా నవ్వి—

"ఆ పిట్టను పట్టుకుందాం," అన్నాడు.

"వద్దు! ఆ అమ్మాయి కోయజాతికి చెందినది. మనం ఆమెను ఏమైనా చేస్తే మనమీద పగ తీర్చుకుంటారు" అన్నాను నేను.

వద్దన్నా వినకుండా ముందుకు వెళ్ళి ఆమె శరీరంలో ఒంపుసొంపులను ఒక చెట్టు చాటునుంచి చూడసాగాడు విలియం.

ఆ కోయమనిషి నీటినుండి బయటకు వచ్చి ఒడ్డునఉన్న బట్టలు ధరించ సాగింది.

విలియం వెనుక చాటున వెళ్ళి ఆ అమ్మాయిని కౌగలించుకున్నాడు.

ఆ అమ్మాయి బిత్తరపోయింది.

అప్పటికే ఆమెను క్రిందకు త్రోసి ఆమెను ఆక్రమించుకోవడానికి చూస్తున్నాడు.

ఆమె భయంతో గింజుకోసాగింది.

ఆమెను వదలకుండా పూర్తిగా ఆక్రమించుకున్నాడు విలియం.

అప్పటివరకు నేను చూడలేదు. ఆ చెట్టుమీద ఒక పక్షి కూర్చొని వుంది. అది భయంకరంగా వాడిఅయిన ముక్కుతో, కత్తులలాంటి గోరులు కలిగి ఉంది.

విలియం ఆమెను ఆక్రమించుకోగానే అది పైకి లేచి భయంకరంగా రెక్కలు విదిల్చి విలియంను వాడి గోర్లతో

రెక్కలు, కళ్ళమీద కసిగా పొడవసాగింది. విలియం ప్రాణభయంతో అరుస్తున్నాడు. క్షణంలో అతడి కళ్ళను పెకిలించి వేసింది.

అది ఆమె పెంపుడు పక్షి అయి వుండాలి.

రివాల్వర్ తీసి దానికి గురిపెట్టి కాల్చాను.

గుండు తగిలి అది రెక్కలు కొట్టుకొంటూ కీచుగా అరుస్తూ నేలకూలింది.

అప్పటికే ఆమె ప్రాణం వదలివేసింది.

విలియం చావుబ్రతుకుల్లో అరుస్తున్నాడు. కొంత సేపటికి అతనిలో చలనం ఆగిపోయింది. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

వెంటనే తేరుకున్నాను. ఇక అక్కడ ఏమాత్రం ఆలస్యం చేసినా నాకు ప్రమాదం తప్పదు.

మూడు శవాలను అతి కష్టంమీద కాలువలోకి తోసేశాను. ఎవరికీ కనిపించకుండా బాగ్ లన్నిటిని కలిపి ఒక అడివి తీగెతో కట్టాను. వాటిని ఈడ్చుకుంటూ వడివడిగా బయలుదేరాను. నా హృదయం భయంతో, ఆవేదనతో కంపిస్తూంది.

మిషన్ గన్ భుజానికి వ్రేలాడుతుంది.

చివరకు ఏ ఆటంకం లేకుండా మేము దాచిన మోటార్ బోట్ దగ్గరకు చేరుకున్నాను. వెళ్లేటప్పుడు నలుగురము, వచ్చేటప్పుడు ఒక్కడిని.

బోట్ లో మిషన్ గన్, బాగ్ లు పడేసి, బోటుత్రాడు విప్పి నీటిలోకి త్రోసి ఇంజన్ స్టార్ట్ చేసాను.

బోటు నీటిని చీల్చుకొంటూ ముందుకు బయలుదేరింది.

–: ఐపోయింది :–